ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ

ఊంజల్ సేవలో భాగంగా అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 22 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా సాగింది. శుక్రవారం అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో అమ్మవారి ఊంజల్ సేవను తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం వైభవంగా సాగింది. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ లక్ష్మీనరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శ ఆళ్వారులను కొలుస్తూ సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. సాయంత్రం స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి వెండి మొక్కు జోడు సేవను నిర్వహించగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు తిరువారాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవను అత్యంత వైభవంగా జరిపారు. కార్తిక మాసం సందర్భంగా భక్తులు దీపారాధన, సత్యనారాయణస్వామి వ్రతపూజలు చేశారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.35,71,152 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న మంత్రులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క దర్శించుకున్నారు. శుక్రవారం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి స్వామివారి కొండపైకి చేరుకోగా ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. అనంతరం స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు వారికి స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఆత్మజ్ఞాన సదస్సులో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న సంపూర్ణానందగిరి స్వామీజీ, ప్రకాశానంద సరస్వతి స్వామి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 22 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని జగద్గురు మఠం లలితాంబిక సుపీఠం సంస్థాపకులు సంపూర్ణానందగిరి స్వామీజీ, కృష్ణా జిల్లా పెనమలూరు జ్ఞాన సరస్వతి పీఠం బాలావధూత ప్రకాశానంద సరస్వతి స్వామీజీ అన్నారు. పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఆత్మజ్ఞాన సదస్సులో శుక్రవారం వారు పాల్గొని మాట్లాడారు. సకల జీవరాసుల్లో మానవ జన్మ అతి పవిత్రమైందన్నారు. ప్రాపంచిక విషయాలతో ఆత్మజ్ఞానం లేకపోవడంతో పలు అనర్థాలకు కారణం అవుతున్నారని పేర్కొన్నారు. సద్గురువుల ద్వారా ఆధ్యాత్మిక భావనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు భారత పురుషోత్తం, ఉపాధ్యక్షుడు చక్రాల నరసింహ, ప్రధాన కార్యదర్శి నోముల అశోక్, గౌరవాధ్యక్షుడు కటకం తుకారాం, ప్రతినిధులు సుంకి వెంకటేశం, నాగేశ్వర్, సత్యనారాయణ, సీతారాములు, బాలయ్య, గోవర్ధన్, రవీందర్, వెంకటయ్య, యాదగిరి, నరసింహ, వీరేశం, ఎల్లప్ప, వెంకటేశ్, భక్తులు పాల్గొన్నారు.

న్యాయవాద రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి : ఐలు

మాట్లాడుతున్న ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేర్డ్డి

భువనగిరి అర్బన్, నవంబర్ 22 : దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, దాడులను అరికట్టాలంటే న్యాయవాద రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేర్డ్డి ప్రభుత్వాన్ని కోరారు. భువనగిరి కోర్టు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించేలా కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన కోర్టుల్లో ఈ – కోర్టు యాప్ ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు రూ.5వేల స్టైఫండ్, 2019 తర్వాత తెలంగాణ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా సహాయ కార్యదర్శి బొల్లెపల్లి కుమార్, న్యాయవాదులు బొమ్మకంటి వెంకటేశ్, బొడ్డు కిషన్, యాదాసు యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, నరహరి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలి : సీఐ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ ప్రభాకర్‌రెడ్డి, డీవైఎఫ్ఐ నాయకులు

బీబీనగర్, నవంబర్ 22 : మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సీఐ ప్రభాకర్‌రెడ్డి, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మంద కిరణ్ అన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై విద్యాసంస్థలు, పరిశ్రమలు, గ్రామాల్లో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువశక్తి పెడదారి పడుతున్నదన్నారు. యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వేయాలని కోరారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారికి మంచి, చెడు విచక్షణ కనిపించదన్నారు. గంజాయి, డ్రగ్స్ దుష్పరిణామాలపై విద్యాసంస్థలు, దుకాణదారులు, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు వి.శ్రావణ్, వినయ్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవాలి : మున్సిపల్ చైర్మన్

చెక్కు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, నవంబర్ 22 : ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మున్సిపాలిటీలోని 7వ వార్డుకు చెందిన ఏనుగు అనితా, మల్లారెడ్డి దంపతుల కుమార్తె పైచదువుల కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో రూ.50వేల ఆర్థిక సాయం శుక్రవారం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు కాసర్ల మంజుల, కొయ్యడ సైదులు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'దివ్యాంగుల పింఛన్ పెంపు కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమం'

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం నిర్వహిస్తామని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ అన్నారు. మండలంలోని పెద్దకొండూరు, జైకేసారం గ్రామాల్లోని దివ్యాంగులు శుక్రవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి రాయగిరి యాదయ్య, నాయకులు సంజీవ, శంకర్, శంకరమ్మ, చంద్రమ్మ, రాములు, యాదయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాల తరలింపు పనులు ప్రారంభం

● యాదగిరి కొండ కింద మిషన్ భగీరథ పైలాన్‌ను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, సీతక్క

మిషన్ భగీరథ పైలాన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, సీతక్క చిత్రంలో ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్

యాదగిరిగుట్ట, నవంబర్ 22 : జిల్లాకు కాళేశ్వరం జలాలతో స్వచ్ఛమైన తాగునీటిని అందించే పనులకు అంకురార్పణ జరిగింది. మిషన్ భగీరథ పథకం కింద మల్లన్నసాగర్ నుంచి జిల్లాకు తాగునీటిని అందజేసేందుకు బ్యాలెన్సింగ్ పైపులైన్ పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఇరిగేషన్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రూ.210 కోట్ల అంచనా వ్యయంతో పైపులైన్ పనులను చేపట్టగా, ఇందుకు సంబంధించిన మిషన్ భగీరథ పైలాన్‌ను యాదగిరిగుట్ట కొండ కింద గల ఘాట్ రోడ్డు వద్ద మంత్రులు శుక్రవారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. గతంలో మేడ్చల్ జిల్లాలోని ఘన్‌పూర్ గుట్ట నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ నీటిని జిల్లాకు అందించారు. కొమురవెల్లి మలన్నసాగర్‌కు సమృద్ధిగా గోదావరి జలాలు వచ్చి చేరడంతో జిల్లాకు మల్లన్నసాగర్ జలాలను అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు సంబంధించిన అనుమతులను సైతం జారీ చేసి పనులను ప్రారంభించి పూర్తి చేయగా, కొంత వరకు పనులను చేయాల్సి ఉంది. ప్రస్తుతం తుర్కపల్లి వరకు పైపులైన్ ఉండగా ఘన్‌పూర్ వరకు 16 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయాల్సి ఉన్నది. ఈ పైపులైన్ పూర్తయితే ఆలేరు, ఆత్మకూరు(ఎం), భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం, గుండాల, మోటకొండూర్, మోత్కూరు, భూదాన్ పోచంపల్లి, రాజాపేట, రామన్నపేట, తుర్కపల్లి, వలిగొండ, యాదగిరిగుట్ట మండలాలను కలుపుకొని మొత్తం 594 అవాస గ్రామాలకు మిషన్ భగీరథ పథకం కింద మల్లన్నసాగర్ జలాలు అందనున్నాయి. ఐలయ్య అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్యారెడ్డి పాల్గొన్నారు

లక్షన్నర ఎకరాలకు సాగుజలాలు

● మంత్రి కోమటిరెడ్డి

రెండు మూడు నెలల్లో గంధమల్ల జలాశయం పనులను ప్రారంభించి జిల్లాలో లక్షన్నర ఎకరాలకు సాగుజలాలు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రూ.18 కోట్లతో వడపర్తి నుంచి చీకటిమామిడి వరకు రోడ్డు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కొలనుపాక బ్రిడ్జి, యాదాపూర్ తండా నుంచి జలాల్‌పూర్ వరకు రోడ్డు మంజూరు చేశామని, మూసీ శుద్ధీకరణ చేసి బస్వాపూర్, గంధమల్ల ద్వారా 1.5 టీఎంసీల గోదావరి నీటిని నింపుతామన్నారు.

526 గ్రామాలకు తాగునీరు

● మంత్రి సీతక్క

మిషన్ భగీరథ పథకం ద్వారా 526 గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. రూ.25వేల కోట్లతో అన్ని గ్రామాలకు డబుల్, లింక్, సిమెంట్ రోడ్లను నిర్మిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 22 లక్షల మంది రైతులకు రూ.18 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. యువతకు 50వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. ఈ నెల 26న గ్రామ పంచాయతీ ఉత్సవాలు నిర్వహిస్తామని, ఇందుకోసం రూ.2వేల కోట్లు మంజూరయ్యాయని చెప్పారు.

సాగు, తాగునీటి నీటి సమస్య లేదు : ప్రభుత్వ విప్ ఐలయ్య

మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పుణ్యాన ఆలేరు నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్య లేదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరుకు సాగు, తాగుజలాల సమస్యలు లేవని, రోడ్లను మంజూరు చేయాలని మంత్రులను కోరారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని

ప్రణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మోటకొండూర్, నవంబర్ 22 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మోటకొండూరు జడ్పీహెచ్ఎస్ 8వ తరగతి విద్యార్థిని ఉండాడి ప్రణవి 68వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేతిరెడ్డి రఘురాంరెడ్డి మాట్లాడుతూ నవంబర్ 23 నుంచి 30వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ అండర్ – 14 హ్యాండ్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున ప్రణవి పాల్గొంటుందని తెలిపారు. అనంతరం ప్రణవిని పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

కేజీబీవీలో తాసీల్దార్ ఆకస్మిక తనిఖీ

లోతుకుంట కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

వలిగొండ, నవంబర్ 22 : మండలంలోని లోతుకుంట గ్రామ పరిధిలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, హాస్టల్‌లో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. 280 మందికి 9స్నానపు గదులు, 9 టాయిలెట్స్ మాత్రమే ఉండడంతో ఉదయం తీవ్ర ఇబ్బంది పడుతున్నామని విద్యార్థినులు తాసీల్దార్ దృష్టికి తెచ్చారు. అదనంగా మరో 10 స్నానాల గదులు, 10 టాయిలెట్లను ఏర్పాటు చేయించాలని కోరారు.

24న సదర్ సమ్మేళనం

రామన్నపేట, నవంబర్ 22 : మండల కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించే సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని యాదవ సంఘం గౌరవాధ్యక్షుడు ముక్కాముల దుర్గయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు తిరుగుడు మల్లికార్జున్, జంగిలి నర్సింహ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సదర్ సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల పండుగను ఈ నెల 24న మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నగేశ్, ఐలయ్య, నరేశ్, లింగస్వామి, కైలాసం, నర్సింహ, మల్లేశం, కోటిలింగం పాల్గొన్నారు.

యాదగిరిరెడ్డి పోరాటం చిరస్మరణీయం : సీపీఐ

ఆలేరు టౌన్ : యాదగిరిరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

ఆలేరు టౌన్, నవంబర్ 22 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు గుర్రం యాదగిరిరెడ్డి చేసిన పోరాటాలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ అన్నారు. ఆలేరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం యాదగిరిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నపేట నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది పేదల కోసం పని చేశారన్నారు. కార్యక్రమంలో మాటూరు జానమ్మ, జంగా సరళ, నీలమ్మ, నరసింహులు, నాగయ్య, ఉమ పాల్గొన్నారు.

రామన్నపేట : మాజీ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, నాయకులు మల్లయ్య, జగన్నాథం, భగవంతం, ముత్తయ్య, వెంకటయ్య, రాంచందర్, సుదర్శన్, యాదగిరి, కృష్ణ, మల్లేశ్, రమేశ్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి'

నల్లగొండలో జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతున్న నాయకులు

భువనగిరి అర్బన్, నవంబర్ 22 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా పనిచేస్తున్న వర్ధన్నపేట, చెన్నూరు ఎమ్మెల్యేలు నాగరాజు, గడ్డం వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రాంచంద్రయ్య అన్నారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న ఇద్దరు ఎమ్మెల్యేల కుట్రలను తిప్పికొట్టడానికి మాదిగలంతా ఐక్యంగా పోరాడాలన్నారు. నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల ఆవరణలో శనివారం జరుగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో మాదిగ ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, మాజీ కౌన్సిలర్ నాగారం అంజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, నాయకులు బండారు రవివర్ధన్, పడిగల ప్రదీప్, బాబు, శివలింగం, రామకృష్ణ, సుభాస్, శంకర్, చిన్న పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

సైబర్ నేరాలపై అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎస్ఐ కృష్ణయ్య

ఆత్మకూరు(ఎం), నవంబర్ 22 : సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు, యువకులకు మండల కేంద్రంలో ఎస్ఐ కృష్ణయ్య శుక్రవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదుగాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్ఐ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

'మాదిగల ఆత్మీయ మహాగర్జనను విజయవంతం చేయండి'

మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కందుల శంకర్

ఆలేరు టౌన్, నవంబర్ 22 : నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో ఈ నెల 24న జరిగే మాదిగల ఆత్మీయ మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కందుల శంకర్ అన్నారు. ఆలేరులోని రహదారి బంగ్లాలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించకుండా కాలయాపన చేస్తుందన్నారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు బక్క రాంప్రసాద్, మాజీ సర్పంచ్ మోత్కూరి ఐలయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు సంగి స్వామి, బైరపాక నాగరాజు, ఎల్లయ్య, సోమయ్య, సుధాకర్, సూర్యం, నరేశ్, కేశవులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ మండల నాయకులు

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు

వలిగొండ, నవంబర్ 22 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆ పార్టీ మండల నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బట్టు దాసురావు, వెల్మకన్నె వెంకటేశ్ పాల్గొన్నారు.

చెరువుల్లో చేప పిల్లలు విడుదల

మల్లాపురం చెరువులో చేప పిల్లలు వదులుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట, నవంబర్ 22 : మండలంలోని మల్లాపురం, వంగపల్లి, కాచారం, సాధువెల్లి గ్రామాల చెరువుల్లో రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శుక్రవారం వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యశాఖ ఆధ్వర్యంలో వంద శాతం రాయితీపై చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 60 లక్షల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయి, మత్స్యశాఖ జిల్లా అధికారి రాజారాం, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

చేప పిల్లల టెండర్ల జాప్యంపై కలెక్టర్‌కు వినతి

కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం ఇస్తున్న జిల్లా మత్స్య శాఖ సహకార సంఘాల నాయకులు

భువనగిరి కలెక్టరేట్/ చౌటుప్పల్, నవంబర్ 22 : చేప పిల్లల టెండర్ల జాప్యంతో ఆర్థికంగా నష్టపోతున్నామని, జిల్లాలో 2024–2025కు సంబంధించి ఉచిత చేప పిల్లల పంపిణీ చేపట్టాలని జిల్లా మత్స్య శాఖ సహకార సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య శాఖ సహకార సంఘాల చైర్మన్లు ఎ.రవిశంకర్, పాశం సంజయ్‌బాబు మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 1.50కోట్ల చేప పిల్లల సరఫరాకు టెండర్ వేస్తే 70లక్షలకు మాత్రమే ఖరారు చేశారని తెలిపారు. జిల్లాలో దాదాపు 400 చెరువుల్లో చేప పిల్లలను ఇంతవరకు వేయలేదని పేర్కొన్నారు. తక్షణమే పూర్తి స్థాయిలో చేప పిల్లలు సప్లయ్ చేసి అన్ని చెరువుల్లో వదలాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా మత్స్య శాఖ సహకార సంఘాల నాయకులు సురేశ్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీశైలం, స్వామి, రమేశ్, పి.రాజు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ

యాదగిరిగుట్ట హాస్టల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్ 22 : పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్‌ను ఆర్డీఓ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, భోజన శాల, బాత్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు అందజేసే సన్నబియ్యం నాణ్యత లేకపోవడంతో బియ్యాన్ని మార్చాలని హాస్టల్ వార్డెన్‌ను ఆదేశించారు. డబ్బాల్లో ఉన్న అల్లం, వెలుల్లి తీసివేసి స్వయంగా తయారు చేసి వ